పత్రికా ప్రకటన - 2

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 04.07.2014

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును జపాన్ కౌన్సిల్ జనరల్ మసనోరి నకానో (Masanori nakano) తన ప్రతినిధి బృందంతో శుక్రవారం సచివాలయంలో కలిశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినందున, ముఖ్యమంత్రిగా కేసిఆర్ ఎన్నికయిన సందర్భాన్ని పురస్కరించుకొని నకానో అభినందనలు తెలిపారు. జపాన్ హస్త కళల ప్రతిమను ముఖ్యమంత్రికి బహుకరించారు. కేసిఆర్ కూడా చార్మినార్ ప్రతిమను జపాన్ ప్రతినిధులకు జ్ఞాపికగా అందించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ నగరాలు, అభివృద్ధి పనులలో జపాన్‌కు చెందిన కంపెనీల భాగస్వామ్యంపై చర్చించారు. హిటాచి, తోషిబా, మిత్సుబిషి లాంటి జపాన్ కంపెనీలు, ఇతర సంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో కార్యాలయాలు పెట్టుకొని పనిచేస్తున్నాయని, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు, కొత్తగూడేం తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉత్పత్తి, ఇతర అంశాలలో జపాన్ సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకొంటున్న విషయాన్ని జపాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. హైదరాబాద్ చాలా గొప్ప, చారిత్రక, సాంస్కృతిక నగరమని ఈ నగరంతో తమ దేశానికి ఎంతో అనుబంధం వుందని జపాన్ ప్రతినిధులు చెప్పారు. దాదాపు 100 మంది జపాన్ దేశస్తులు హైదరాబాద్‌లో నివసిస్తున్నారని తెలిపారు. మధ్య తరహా, చిన్న తరహ పరిశ్రమలకు తమ దేశం సహాయ సహకారాలు అందిస్తున్నదని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు, ఇక్కడి ప్రభుత్వంతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలలో పాలు పంచుకునేందుకు సిద్ధంగా వున్నట్లు జపాన్ ప్రతినిధులు చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో కలిసి పనిచేసేందుకు, విద్యుత్ ఉత్పత్తి విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విషయంలో జపాన్ సోదర భావంతో వ్యవహరిస్తుందని చెప్పారు. జపాన్ ప్రతినిధుల ప్రతిపాదనల పట్ల ముఖ్యమంత్రి కేసిఆర్ ఆనందం, సానుకూలత వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సహజ వనరులున్న ప్రాంతమని, ఖనిజ నిక్షేపాలు వున్నాయని, సమశీతోష్ణ వాతావరణం, అటవీ సంపద,

వివిధ రకాల స్వభావాల నేలలు వున్నాయని ఇవన్ని చాలా  సానుకూల అంశాలని ముఖ్యమంత్రి చెప్పారు. భూకంపాలు, సునామి లాంటి ప్రకృతి వైపరిత్యాలు కూడా వుండవని, పారిశ్రామికీకరణకు పూర్తి అనుకూల ప్రాంతమని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని కూడా అంతార్జాతీయ ప్రమాణాలు కల నగరంగా తీర్చి దిద్దనున్నామని వెల్లడించారు. రాబోయో ఒకటి రెండేళ్లలో మరో హైదరాబాద్‌ను చూస్తారని చెప్పారు. దేశంలోనే అత్యంత ఉత్తమ పారిశ్రామిక విధానానికి రూపకల్పన చేస్తున్నామని,  విదేశి పెట్టుబడిదారుల కోసం కూడా ప్రత్యేక పాలసీ వుంటుందని చెప్పారు.  సమగ్ర విధానం రూపకల్పనకు మరో నెల రోజుల సమయం పడుతుందని అప్పుడు మరొకసారి సమావేశమయి జపాన్ - తెలంగాణ కలిసి చేసే కార్యక్రమాలను రూపొందించుకుందామని కేసిఆర్ ప్రతిపాదించారు.  జపాన్ ఆర్థిక సహాయంతో ఇప్పటికే ఇక్కడ అమలవుతున్న జైకా కార్యక్రమాలపై కూడా ఇద్దరి మధ్య చర్చ జరిగింది. జపాన్‌లో విద్యుత్ ఉత్పత్తి పద్దతులపై కూడా చర్చ జరిగింది.

---------------------------------------------------------------------